సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



ఆహారం.. ఆరోగ్యం

ఆరోగ్యకర జీవనంలో పోషకాహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా చిన్నారుల్లో పోషకాహార లోపాలు వారి భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారతాయి.

8లో



సాయమందజేసీ

ఉద్యోగం పేరుతో మోసానికి గురై, చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో చిక్కుకున్న దివ్యాంగుడు, అతడి కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్ నిషాంతి రక్షించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం రాత్రి 7,47,782 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. అలాగే డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులకు చేరుకుంది.

వైద్య విద్య... ఇక మిథ్య





అమలాపురంలో మధ్యలో ఆగిపోయిన వైద్య కళాశాల భవన నిర్మాణాలు

- జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటుపరం
- పీపీపీ విధానంలో నిర్మించాలని మంత్రివర్గం తీర్మానం
- పేదల ఉన్నత చదువులపై కూటమి ప్రభుత్వ కుట్ర
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల విద్యకు పెద్దపీట

సాక్షి, అమలాపురం: అందరూ అనుమానించినట్టుగానే జిల్లా కేంద్రం అమలాపురంలో ప్రభుత్వ వైద్య కళాశాల.. దీనికి అనుబంధంగా ఏరియా ఆసుపత్రి ఉన్నతీకరణ ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోనుంది. ఈ మేరకు మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేట్ పరం చేస్తోందని 'సాక్షి' ఏడాది నుంచి చెబుతూనే ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వద్ద మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది.

పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు ఒక వైద్య కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, ఇప్పుడు వాటికి నిధుల కొరత చూపించి పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో వైద్య కళాశాల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమలాపురం పట్టణాన్ని ఆనుకుని సమనస, చిందాడగరువు పరిధిలో కళాశాల నిర్మాణానికి రూ.500 కోట్లు మంజూరు చేసింది. ఈ నిర్మాణ పనులు గత ప్రభుత్వంలో వేగంగా జరిగాయి. కళాశాల తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర అవసరాలకు సంబంధించి భవన నిర్మాణ పనులు జరిగాయి. కొన్ని భవనాలకు రెండు, నాలుగు అంతస్తులు సైతం నిర్మించారు. కాలేజీకి అనుబంధంగా అమలాపురం ఏరియా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా విస్తరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం 100 పడకల ఆసుపత్రిగా ఉన్న దీనిని తొలి దశలో 650 పడకలుగా, తరువాత మరింత విస్తరించి వెయ్యి పడకల ఆసుపత్రిగా మార్పు చేయాలని ప్రతిపాదించారు. గత ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల అమలాపురంలో అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అందుబాటులోకి వస్తోందని కోనసీమ వాసులు భావించారు. ఎన్నికల వరకూ వేగంగా సాగిన పనులు తర్వాత నుంచి నెమ్మదించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు మొత్తం ఆగిపోయాయి. దీనిపై స్థానిక సంస్థల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. నిర్మాణ సంస్థ చాలా వరకూ నిర్మాణ సామగ్రిని తీసుకు వెళ్లిపోయింది.

మెరుగైన వైద్యం ఇంకెప్పుడు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరాల్లో మాత్రమే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు (జీజీహెచ్‌లు) ఉన్నాయి. కోనసీమలో కిమ్స్ ప్రైవేట్ వైద్య కళాశాల, ఆసుపత్రి ఉన్నా రోగుల అవసరాలు పూర్తిగా తీర్చడం లేదు.

అమలాపురం, రామచంద్రపురం మున్సిపాలిటీల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల ప్రజలకు ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యం అందే అవకాశం లేదు. వైరల్ జ్వరాలకు పేదలు, సామాన్యులు కూడా కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వచ్చింది. డెంగీ వంటి జ్వరాలు వస్తే సాధారణ వ్యక్తులు కూడా రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అదే ప్రభుత్వ పెద్ద ఆసుపత్రులు అందుబాటులో ఉంటే వైద్యం దాదాపు ఉచితంగా పొందే అవకాశముంది.

'కూటమి'పై మండిపడుతూ..

ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో కార్పొరేట్ చేస్తే తాము వైద్య విద్యపై ఆశలు వదులుకోవాల్సిందేనని పేదలు, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిభ ఉండి కూడా ప్రైవేట్ కళాశాలల్లో చదివే స్తోమత లేని వారు కూటమి ప్రభుత్వ నిర్ణయంపై మండి పడుతున్నారు.

పీపీపీ విధానం దారుణం



గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను తీసుకువస్తే నేటి కూటమి ప్రభుత్వం వాటిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడం దారుణం. తక్షణమే వాటి ప్రైవేటీకరణకు చేస్తున్న కసరత్తు రద్దు చేయాలి. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4 వేల మంది పేద, సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులు వైద్య విద్యకు దూరం కానున్నారు.

– మిండగుదిటి శిరీష్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

విద్యా సంఘాలు ఉద్యమించాలి




వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించడం మంచి నిర్ణయం కాదు. ఇప్పుడు యువత డిగ్రీలు చేయడం లేదు. మెడికల్, ఇంజినీరింగ్, ఐఐటీ, ఎన్ఐటీలకు వెళుతున్నారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీ నిర్మిస్తే ఎందరో పేద, సామాన్య విద్యార్థుల భవిష్యత్తు బంగారం అవుతుంది. ప్రభుత్వమే కళాశాల నిర్మించాలని విద్యార్థులు, విద్యా సంఘాలు కలసి ఉద్యమించాలి.

– గంటి చిరంజీవి, విద్యార్థి సంఘ మాజీ నాయకుడు, అమలాపురం

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ కార్యదర్శులకు నియోజకవర్గాల బాధ్యతలు



కర్రి పాపారాయుడు



చెల్లుబోయిన శ్రీనివాసరావు



చింతపాటి శ్రీనివాసరాజు



పాటి శివకుమార్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని నలుగురు పార్టీ రాష్ట్ర కార్యదర్శులకు అమలాపురం పార్లమెంట్ నియోజవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. జిల్లాకు చెందిన రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, చింతపాటి శ్రీనివాసరాజు, పాటి శివకుమార్‌లకు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వచ్చాయి. కర్రి పాపారాయుడికి రాజోలు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాలు, చెల్లుబోయిన శ్రీనివాసరావుకు ముమ్మిడివరం, మండపేట అసెంబ్లీ నియోజకవర్గాలు, చింతపాటి శ్రీనివాసరాజుకు రామచంద్రపురం, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాలు, శివకుమార్‌కు కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు కేటాయించారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయంతో ఉంటూ, సంబంధిత పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకునికి సహాయకారిగా వ్యవహరించాలని కేంద్ర పార్టీ కార్యాలయం సూచించింది. ఈ నలుగురు పార్టీ రాష్ట్ర కార్యదర్శులను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఆయా నియోజకవర్గాల పార్టీ కోఆర్డినేటర్లు తోట త్రిమూర్తులు (ఎమ్మెల్సీ), గొల్లపల్లి సూర్యారావు (మాజీ మంత్రి), పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ (మాజీ ఎమ్మెల్యే), పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు అభినందించారు.

రూ. వెయ్యి నాణెం సేకరణ



రూ.వెయ్యి నాణెం (రెండు వైపులా)

అమలాపురం టౌన్: చక్రవర్తి రాజేంద్ర చోళ నావికా దండయాత్ర-1 పై ముంబయి టంకశాల ముద్రించిన రూ.వెయ్యి నాణేన్ని అమలాపురానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. రాజేంద్ర చోళుడు నిర్వహించిన చారిత్రాత్మక నావికా యాత్రకు వెయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా ముద్రించిన ఈ నాణేన్ని తాను సేకరించినట్లు కామేశ్వర్ తెలిపారు.

11, 12 తేదీల్లో జాతీయ కళా ఉత్సవ్ పోటీలు

రాయవరం: విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ నెల 11, 12 తేదీల్లో జాతీయ కళా ఉత్సవ్-2025 పోటీలు బొమ్మూరు డైట్ వేదికగా నిర్వహిస్తున్నారు. కోనసీమ జిల్లా పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థల పాఠశాలలు, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈ పోటీలు జరుపుతున్నారు. 9, 10, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీలను ఆరు కళారూపాల్లో 12 విభాగాల్లో విడివిడిగా నిర్వహిస్తున్నారు. గాత్ర సంగీతంలో రెండు విభాగాలు (సోలో అండ్ గ్రూపు), వాయిద్య సంగీతంలో మూడు విభాగాలు (సోలో సైరింగ్, సోలో పెరుక్యుషన్, గ్రూపు), నృత్యంలో రెండు విభాగాలు (సోలో అండ్ గ్రూపు), దృశ్య కళల్లో మూడు విభాగాలు (సోలో 2డీ, 3డీ, గ్రూపు 2డీ లేదా 3డీ) థియేటర్ ఆర్ట్స్, సంప్రదాయ కథనాల్లో కేవలం గ్రూపులో ఉంటాయి. వివరాలకు నోడల్ ఆఫీసర్ రాజేష్, లెక్చరర్ శిరీష 94906 48110, 94747 79999 నంబర్లను సంప్రదించాలి.

అవార్డులకు ఎంపిక చేయండి

అమలాపురం రూరల్: పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శనివారం అమలాపురం కలెక్టరేట్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల విధి విధానాలపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ఎంపిక ప్రక్రియను జిల్లా అధికారులు పారదర్శకంగా చేపట్టి, అన్ని విభాగాల్లో ఉత్తమ అవార్డులకు ఎంపిక చేయాలన్నారు. జిల్లాలోని ఉత్తమ ప్రభుత్వ కార్యాలయాలు, పురపాలక సంఘాలు, మున్సిపల్ వార్డు, గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ సెంటర్లు, బస్టాండ్‌లు, ఆసుపత్రులు, పాఠశాలలు, రైతు బజార్ల నుంచి ఉత్తమమైన వాటిని మాత్రమే ఎంపిక చేయాలని అన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: యూరియా కొరత, ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. దీనికి సంబంధించి శనివారం చిర్ల జగ్గిరెడ్డి స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో అన్నదాత పోరు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ తరఫున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి బాబి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరి శివాజీ, పార్టీ నాయకులు కప్పల శ్రీధర్, తమ్మన శ్రీను, బొక్కా కరుణాకరం, కనుమూరి శ్రీనివాసరాజు, సర్పంచ్ సబ్బితి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో ఆటోల బంద్

- ఆటో డ్రైవర్ల సామూహిక నిరాహార దీక్షలు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని నిరసిస్తూ ఆందోళనలు



అమలాపురంలో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు, యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్ర ఆటోవాలా జిల్లా శాఖ తమ నిరసనను రోజురోజుకూ ఉధృతం చేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్ పాటించి, ఆ రెండు రోజులూ ఆటో డ్రైవర్లు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు జిల్లా ఆటోవాలా యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ప్రకటించారు. అమలాపురం పట్టణం గొల్లగూడెంలో ఆటో డ్రైవర్లు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సత్తిరాజు అధ్యక్షతన జరిగిన ఆటో కార్మికుల సమావేశానికి ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆటో కార్మికుల ఉద్యమానికి దిశానిర్దేశం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని నిరసిస్తూ చేపట్టిన కార్యాచరణను జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్ సమావేశంలో ప్రవేశపెట్టారు. అసలే ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి అవస్థలు పడుతుంటే, మరోపక్క ఈ నెల 8 నుంచి నిర్వహించే ప్రైవేట్ ట్రావెల్స్ యాప్ ద్వారా రాపిడ్ – ఉబర్ ఆపరేషన్లతో మరింత ఇబ్బంది పడనున్నారని జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు అన్నారు. ఈ యాప్‌లు ఆటో డ్రైవర్లకు గోరుచుట్టు మీద రోకలి పోటు అన్నట్లు ఉందన్నారు. ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

వలంటీర్ విధులు మాకొద్దు..



మామిడికుదురులో నిరసన తెలుపుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

మామిడికుదురు: వలంటీర్ విధులు మాకొద్దంటూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎంపీడీఓ బి.భవానికి శనివారం వినతిపత్రం ఇచ్చారు. నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. తమ బాధను పలుమార్లు అధికారులకు వినతిపత్రాల ద్వారా తెలిపినా ఎటువంటి స్పందన లేదన్నారు. దీంతో పాటు రోజురోజుకూ తమ ఆత్మ గౌరవాన్ని మరింత దిగజారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో ప్రాణవాయువు లాంటి సచివాలయ ఉద్యోగుల శక్తిని నిర్వీర్యం చేసేలా అధికార వర్గాలు ప్రవర్తిస్తున్నాయన్నారు. గతంలో వలంటీర్ ఒక క్లస్టర్‌కు పరిమితం కాగా, సచివాలయ ఉద్యోగులకు మాత్రం ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లను బలవంతంగా ఇచ్చి ఇంటింటికీ తిరిగే విధులు అప్పగిస్తున్న తీరుపై నిరసన తెలుపుతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రణభేరి



రణభేరి జాతా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా యూటీఎఫ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పాఠశాల విద్యారంగ, ఆర్థిక పరమైన సమస్యలపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జరుగనున్న యూటీఎఫ్- రణభేరి జాతాను విజయవంతం చేయాలని జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీఎస్ సుబ్బారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు రణభేరి జాతా పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని, ఉపాధ్యాయులపై యాప్‌ల పనిభారాన్ని, పీ-4, విద్యాశక్తి తదితర కార్యక్రమాల ఒత్తిడి పెంచిందని అన్నారు. దీనికి తోడు పరీక్షల మూల్యాంకనం, ఆన్‌లైన్ అప్లోడ్, గ్రీన్ పాస్‌పోర్టు మొదలైన బోధనేతర పనులను ఉపాధ్యాయులపై మోపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యా బోధనకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. డీఏలు విడుదల చేయాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రణభేరి జాతాల్లో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

జిల్లా ఎక్సైజ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రేణుక

అమలాపురం టౌన్: జిల్లా ఎక్సైజ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రేణుక బాధ్యతలు స్వీకరించారు. అమలాపురంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టి జిల్లాలో 11 బార్లలో 10 బార్లకు మళ్లీ జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ ఇటీవల బార్లకు దరఖాస్తుల స్వీకరణలో చోటుచేసుకున్న వైఫల్యం కారణంగా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో అసిస్టెంట్ కమిషనర్ రేణుక జిల్లా సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకు మంజూరైన 11 బార్లకు సంబంధించి అమలాపురంలో ఒకే ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు వచ్చి లాటరీలో అర్హత సాధించింది. మిగిలిన 10 బార్లకు దరఖాస్తులు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో సూపరింటెండెంట్ ప్రసాద్‌పై బదిలీ వేటు అనివార్యమైంది. తాజాగా మిగిలిన 10 బార్లకు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. అమలాపురం మున్సిపాలిటీలో 3, రామచంద్రపురంలో 2, మండపేటలో 2, ముమ్మిడివరం నగర పంచాయతీలో 1, దిండి రిసార్ట్స్‌కు 1, అమలాపురం, రామచంద్రపురం పట్టణాలకు రెండు గీత కులాలకు బార్లు మంజూరైన సంగతి తెలిసిందే.

నేడు జిల్లాలో ఆలయాల మూసివేత

సఖినేటిపల్లి: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని అంతర్వేది ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూసివేయనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పౌర్ణమి సందర్భంగా రాత్రి 9.50 గంటల రాత్రి 12.24 గంటల వరకూ చంద్రగ్రహణం ఉంటుందన్నారు. తిరిగి సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 8 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు ఉంటాయన్నారు. అదేరోజు వేకువజామున నిర్వహించాల్సిన ఆర్జిత అభిషేకం రద్దు చేసినట్టు వెల్లడించారు.

కల్యాణాలు రద్దు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం 6 గంటలకు మూసి, రాత్రి జరిగే కల్యాణాలను రద్దు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి సంప్రోక్షణ అనంతరం యథావిధిగా దర్శనాలు ప్రారంభిస్తామన్నారు

జై గణేశ.. బై గణేశ

జిల్లాలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు



గొల్లవిల్లిలో వివిధ పండ్లతో వినాయక విగ్రహానికి అలంకరణ


పి.గన్నవరం: జై గణేశ.. బై గణేశ అంటూ వినాయక నవరాత్రుల్లో పూజలందుకున్న స్వామివారిని భక్తుల కోలాహలం నడుమ సాగనంపారు. జిల్లా వ్యాప్తంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గోదావరి నదీ పాయలు, కాలువలు, సాగర తీరాల్లో స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. తొలుత ఊరేగింపులు నిర్వహించి తమ భక్తిని చాటారు. పి.గన్నవరం మండలం చాకలిపాలెం గ్రామంలో న్యాయవాది మొల్లేటి శ్రీనివాసరావు కుటుంబం ఆధ్వర్యంలో చిరు గణనాథుల ట్రాలీ యాత్ర ఆకట్టుకుంది. చిన్న యడ్ల బండిపై వినాయకు ఉత్సవ విగ్రహాన్ని ఉంచి దాని వెనుక 30 ట్రాలీలపై చిరు గణనాథుల ప్రతిమలతో చాకలిపాలెం నుంచి రాజోలు మండలం సోంపల్లి వరకూ చిన్నారులు ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. అనంతరం వినాయకుని ప్రతిమలను సోంపల్లి వద్ద వశిష్ఠ నదీపాయలో నిమజ్జనం చేశారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలోని సిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా వినాయకుడిని రకరకాల పండ్లతో విశేషంగా అలంకరించారు.



చాకలిపాలెంలో నిమజ్జనానికి సిద్ధమైన గణనాథుల ట్రాలీలు

నేడు ఆకాశంలో అద్భుతం

- కనువిందు చేయనున్న బ్లడ్‌మూన్
- నేటి రాత్రి రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం
- మధ్యాహ్నం నుంచి ఆలయాల మూసివేత



బ్లడ్ మూన్ (ఫైల్)

రాయవరం: ఆకాశంలో ఆదివారం రాత్రి అద్భుతం కనిపించనుంది. చంద్రగ్రహణం కారణంగా బ్లడ్‌మూన్ కనువిందు చేయనుంది. సహజ ఖగోళ సంఘటన కారణంగా భాద్రపద శుక్ల పౌర్ణమి రోజున సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుంది. పంచాంగ కర్తల పరిభాషలో దీనిని రాహుగ్రస్త చంద్రగ్రహణం అంటారు. గ్రహణం రాత్రి 9.56 గంటల నుంచి స్పర్శ కాలం ప్రారంభమవుతుంది. అర్ధరాత్రి 1.26 గంటలకు శుద్ధ మోక్షం లభిస్తుంది. గ్రహణ సమయానికి ముందే జిల్లాలోని అంతర్వేది, ద్రాక్షారామ, వాడపల్లి, కోటిపల్లి, ముక్తేశ్వరం, సోమేశ్వరం, అయినవిల్లి వంటి ప్రధాన ఆలయాలతో పాటు, ఇతర ఆలయాలను మూసివేస్తారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి సంప్రోక్షణ అనంతరం దర్శనాలు యథావిధిగా చేపట్టనున్నారు.

ఎందుకంటే..

సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖలోకి వచ్చినప్పుడు భూమి సూర్యకాంతిని చంద్రునిపై పడకుండా అడ్డుకుంటుంది. అప్పుడు చంద్రుడు కనిపించడు. దీనినే చంద్రగ్రహణం అంటారు. భూమి సూర్యకాంతిని అడ్డుకుంటుంది. కొంత సూర్యకాంతి భూమి వాతావరణంగా గుండా చంద్రునిపై పడుతుంది. వాతావరణం నీలం రంగు కాంతిని వ్యాప్తి చేసి ఎరుపు రంగు కాంతిని మాత్రమే చంద్రుని వైపు పంపుతుంది. అందుకే చంద్రుడు ఎరుపు లేదా ఆరెంజ్ రంగులో కన్పిస్తాడు. ఈ దృశ్యాన్ని బ్లడ్‌మూన్ అంటారు.

చంద్ర గ్రహణాన్ని చూడొచ్చు



ఏడాదిలో కనీసం రెండు చంద్ర గ్రహణాలు వస్తాయి. అన్నీ బ్లడ్‌మూన్‌గా ఏర్పడవు. ఈ ఏడాది మార్చి 13న బ్లడ్‌మూన్ ఏర్పడినా మన దేశంలో కన్పించలేదు. ఆదివారం ఏర్పడే బ్లడ్‌మూన్‌ను కంటితో నేరుగా చూడవచ్చు.

– కె.శ్రీకృష్ణసాయి, అధ్యక్షుడు, రేవతి సైన్స్ ఫౌండేషన్, రామచంద్రపురం

మధ్యాహ్నం నుంచి సూతక కాలం



చంద్రగ్రహణం ఏర్పడడానికి తొమ్మిది గంటల ముందు నుంచి సూతక కాలంగా పిలుస్తారు. ఆదివారం మధ్యాహ్నం 12.57 గంటల నుంచి సూతక కాలం ప్రారంభమవుతుంది. సూతక కాలం ప్రారంభంలోనే ఆలయ ద్వారాలు మూసివేస్తారు.

– విలపర్తి ఫణిధర్‌శర్మ, ఆగమ పండితుడు, రాయవరం

క్లుప్తంగా

కిడ్నీ బాధితుడికి రూ.1.61 లక్షల ఆర్థిక సాయం



కిడ్నీ బాధితుడి తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పెదపూడి: కిడ్నీ బాధితుడికి వైద్య ఖర్చుల కోసం సంపర ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు రూ.1,61,162 ఆర్థిక సాయం అందజేశారు. ఆ అసోసియేషన్ ఫౌండర్ కం చైర్మన్ వడ్డి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సంపర గ్రామానికి చెందిన చల్లపల్లి నాగేశ్వరరావు బతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి, అక్కడ ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమారుడు చల్లపల్లి సతీష్‌కు కేవలం 20 ఏళ్ల వయసులోనే రెండు కిడ్నీలు పాడై, వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు ఆర్థిక సాయం కోసం తమ సొంత ఊరు సంపరలోని ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులను ఆశ్రయించాడు. స్పందించిన సభ్యులు రూ.1,61,162 సేకరించి కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా శనివారం మధ్యాహ్నం నాగేశ్వరరావుకు అందజేశారు. అలాగే కలెక్టర్ షణ్మోహన్.. సంపర అసోసియేషన్ కార్యక్రమాలను పరిశీలించి, అభినందించి బాధితుడి తండ్రికి మరో రూ.10 వేలు తన సొంత సొమ్ములు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కుందూరి వెంకట సుబ్బారావు కొమ్మన శ్రీనివాసరావు, యానాల మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆహారం.. ఆరోగ్యం

- పోషకాహారంతో ఎన్నో ప్రయోజనాలు
- ఈ నెల 12 నుంచి రాష్ట్రీయ పోషణ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 11 వరకూ కార్యక్రమాలు



పోషణ్ మా లోగో



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం (ఫైల్)

రాయవరం: ఆరోగ్యకర జీవనంలో పోషకాహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. దానిలో ఎలాంటి లోపాలున్నా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా చిన్నారుల్లో పోషకాహార లోపాలు వారి భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారతాయి. పోషకాహార లోపాల నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి స్త్రీ, శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి అక్టోబర్ 11 వరకూ 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ 2025 నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,546 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ్ అభియాన్-మిషన్ పోషణ్ 2.0 పేరుతో నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఊబకాయం, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఏక్ పేడ్ మాకే నామ్, ఇన్‌ఫాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్ ప్రాక్టీసెస్, మెన్ స్ట్రీమింగ్ - ఇన్వాల్వింగ్ మెన్ ఇన్ న్యూట్రిషన్ అండ్ కేర్ గివింగ్ తదితర అంశాలను వివరిస్తారు.

కోనసీమ జిల్లా పరిధిలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో మండపేట, రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలోని 1,726 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7,725 మంది గర్భిణులు, 5,848 మంది బాలింతలు, 901 మంది ఆరు నెలల లోపు చిన్నారులు, 7,017 మంది ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు, 8,041 మంది 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

కోనసీమ జిల్లా వ్యాప్తంగా గత విద్యా సంవత్సరంలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా 1,81,759 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 70,254 మందికి రక్తహీనత పరీక్షలు నిర్వహించగా, 16,680 మంది ఎనిమిక్‌గా ఉన్నట్లు గుర్తించారు. అలాగే కంటి వైద్య పరీక్షల అనంతరం 3,300 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. 1,204 మంది చర్మవ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించగా, 100 మందికి హియరింగ్ ఎయిడ్స్ అందజేశారు. 10 మందికి గ్రహణం మొర్రి ఉన్నట్లుగా గుర్తించగా, వీరిలో 9 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో జూలైకు సంబంధించి 7,303 మంది గర్భిణులు ఉండగా, వారిలో 542 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. మొత్తం గర్భిణుల్లో 7.42 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. వారికి టీహెచ్ఆర్ పంపిణీ చేస్తున్నారు.



పోషకాహారం

పోషకాహారంపై అవగాహన

అందరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉంచాలని ప్రతి ఏటా సెప్టెంబర్‌లో జాతీయ పోషకాహార వారోత్సవాలను అమలు చేస్తున్నారు. గతంలో వారం రోజుల పాటు నిర్వహించగా, వీటిని ఇప్పుడు నెల రోజులకు పొడిగించారు. కోవిడ్ 19 తదనంతర పరిస్థితుల్లో పోషకాహారం మరింతగా తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ పోషకాహార వినియోగంపై సూచనలు అందిస్తోంది. విటమిన్ ఏ లేకపోవడం వల్ల మన దేశంలో ఏటా 30 వేల మంది కంటి చూపును కోల్పోతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఊబకాయం వల్ల టైప్ - 2 డయాబెటీస్, ఫ్యాటీ లివర్ వ్యాధి, పిత్తాశయంలో రాళ్లు, కీళ్ల రుగ్మతలు, రక్త పోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయి. వీటి నివారణకు సరైన పోషకాహార వినియోగంపై అధికారులు అవగాహన కల్పించనున్నారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహణ



చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాల నివారణకు పోషణ మాసోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తాం. ముఖ్యంగా ఐదు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో లయన్ డిపార్ట్‌మెంట్లతో కలిసి కార్యక్రమాలు చేపడతాం. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించడం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళతాం.

– వై.విజయశ్రీ, ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

గణపతి ఊరేగింపులో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు: గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపులో భాగంగా నిర్వహిస్తున్న ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. విగ్రహాన్ని ఊరేగిస్తున్న ట్రాక్టర్ తొట్టెపై నుంచి ఒక వ్యక్తి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఒమ్మంగి గ్రామంలో శనివారం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఊరేగిస్తున్నారు. ఆ గ్రామంలోని అంబేడ్కర్ సెంటర్‌కు వచ్చేసరికి ట్రాక్టర్ తొట్టిలో ఉన్న అదే గ్రామానికి చెందిన దొండపాటి నూకరాజు (నాని) కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆ గ్రామ యువకులు బైక్‌పై ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించినట్టు సీహెచ్‌సీ వర్గాలు తెలిపాయి.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

రైలు నుంచి జారిపడి అస్సాం వాసి మృతి

తుని: రైలు నుంచి జారి పడి అస్సాంకు చెందిన వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వివరాల్లోకెళితే.. అస్సాంలోని గోలఘాట్ జిల్లాకు చెందిన రోమన్ గోగోయ్.. డిబ్రూఘర్ నుంచి కన్యాకుమారి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. ప్రమాదవశాత్తూ నర్సీపట్నం - గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నేడు శనైశ్చరాలయం మూసివేత

కొత్తపేట: చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి కొత్తపేట మండలం మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి ఆలయం మూసివేయనున్నారు. ఈ విషయాన్ని దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.55 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకూ చంద్ర గ్రహణం ఉంటుందన్నారు. దీంతో గ్రహణ సమయానికి ముందుగానే మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం మూసివేయనున్నట్టు తెలిపారు. మళ్లీ సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 8 గంటలకు ఆలయాన్ని తెరిచి తైలాభిషేకాలు, భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని తెలిపారు.

కొబ్బరి చెట్టు పైనుంచి పడి వార్డు మెంబర్ మృతి



సత్యనారాయణ (ఫైల్)

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంక పంచాయతీ రెండో వార్డు మెంబర్ కముజు వీర వెంకట సత్యనారాయణ (48) శనివారం కొబ్బరి చెట్టుపై నుంచి పడి మృతి చెందారు. ఉదయం కొబ్బరి బొండాం కోసం చెట్టు ఎక్కి, కాలు జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని ముమ్మిడివరం ఆసుపత్రికి తరలించగా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య శ్రీలక్ష్మి, ఒక కుమార్తె, వృద్ధ తల్లిదండ్రులు సత్యనారాయణ, సత్యవతి ఉన్నారు. భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై జ్వాలా సాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయమందజేసీ

- ఉద్యోగం పేరుతో మోసపోయిన దివ్యాంగుడు
- భార్యాపిల్లలతో సహా చెన్నైలో చిక్కుకున్న వైనం
- రక్షించిన జాయింట్ కలెక్టర్ నిషాంతి



జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం రూరల్: ఉద్యోగం పేరుతో మోసానికి గురై, చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో చిక్కుకున్న దివ్యాంగుడు, అతడి కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్ నిషాంతి రక్షించారు. వివరాల్లోకి వెళితే.. అమలాపురానికి చెందిన నాగేశ్వరరావు అనే దివ్యాంగుడికి ఉద్యోగం ఇప్పిస్తానని శంకర్రావు అనే వ్యక్తి నమ్మించాడు. చెన్నైలో ఉద్యోగం ఉందంటూ చెప్పి నాగేశ్వరరావు, అతడి భార్య, పిల్లలను తీసుకువెళ్లాడు. చెన్నైలోని సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో దిగిన తర్వాత, వారి దగ్గర ఉన్న డబ్బులను తీసుకుని పరారయ్యాడు. వెంటనే నాగేశ్వరరావు.. జేసీ నిషాంతికి ఫోన్ చేసి, తన పరిస్థితిని వివరించాడు. భార్యాపిల్లలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. స్పందించిన జేసీ.. వెంటనే చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ సిబ్బందితో మాట్లాడి, నాగేశ్వరరావు కుటుంబానికి రైలు టిక్కెట్లు, ప్రయాణ సౌకర్యాలను ఏర్పాటు చేయించారు. ఖర్చు కోసం తన సొంత డబ్బును పంపించి ఆ కుటుంబాన్ని రక్షించారు.

నేడు అద్దేపల్లి సాహిత్య పురస్కార ప్రదానం

బోట్‌క్లబ్ (కాకినాడ): ప్రముఖ కవి అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కారాన్ని రాజమహేంద్రవరానికి చెందిన రెంటాల వెంకటేశ్వరరావుకు ప్రదానం చేయనున్నారు. కాకినాడలోని రోటరీ హాల్లో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ విషయాన్ని నిర్వాహకులు అద్దేపల్లి రాధాకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. పురస్కార ప్రదానం అనంతరం వచన కవిత పోటీలు నిర్వహిస్తామని, వాటికి దొండపాటి నాగజ్యోతి శేఖర్ న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తారన్నారు.

పాఠశాల 150 ఏళ్ల వేడుకకు హాజరు కావాలి


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని ఆహ్వానించిన ఎమ్మెల్సీ కుడుపూడి



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని వేడుకలకు ఆహ్వానిస్తున్న సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పడి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చే నవంబర్‌లో నిర్వహించనున్న వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడిని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు స్వయంగా ఆహ్వానించారు. విజయవాడ సమీపంలోని స్వర్ణ భారతి ట్రస్ట్ భవనంలో ఉన్న ఆయన్ని ఎమ్మెల్సీ కలసి ఆహ్వాన పత్రాన్ని శనివారం అందించారు. విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో ఇద్దరూ కలసి చదువుకున్నారు. యూనివర్సిటీ లా కాలేజీలో వారు విద్యార్థులుగా ఉన్న సమయంలో జరిగిన స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా వెంకయ్య నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సూర్యనారాయణరావు ఎన్నికయ్యారు. అప్పట్లో వీరిద్దరూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో జరిగిన పోరాటంలో పాలు పంచుకున్నారు. ఈ చనువు, స్నేహంతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150 ఏళ్ల వేడుకలకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించానని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తెలిపారు. తన ఆహ్వానం మేరకు విధిగా హాజరవుతానని అన్నారన్నారు. అలాగే ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబును ఆహ్వానించనున్నట్లు తెలిపారు. వెంకన్నాయుడు, హరిబాబు, తాను ఆంధ్ర యూనివర్సిటీలో చదివామన్నారు.

బాల బాలాజీకి రూ.2.04 లక్షల ఆదాయం



అప్పనపల్లి బాల బాలాజీ స్వామికి తొలి హారతి ఇస్తున్న అర్చకుడు

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువైన బాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామి వారికి ఆలయ అర్చకులు సుప్రభాత సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో ఏర్పాటు చేసిన తొలి హారతిని దర్శించుకున్న భక్తులు ఆనందంతో ఉప్పొంగి పోయారు. స్వామి వారి సన్నిధితో నిత్యం నిర్వహించే లక్ష్మీనారాయణ హోమం వైభవంగా జరిగింది. పలువురు భక్తులు ఈ హోమంలో పాల్గొన్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2.04 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. 3,800 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 1,700 మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.72,647 విరాళంగా చెల్లించారన్నారు.

220 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పాచిపెంట: విజయనగరం, పార్వతీపురం మన్యం మీదుగా ఒడిశా రాష్ట్రానికి అక్రమంగా లారీలో తరలిస్తున్న 220 టన్నుల రేషన్ బియ్యాన్ని పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో శనివారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లంపూడి నుంచి ఒడిశాలోని నౌగాంకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిసింది. చెక్‌పోస్టు వద్ద విజిలెన్స్ సీఐ సింహాచలం, సిబ్బందితో కలిసి లారీని పట్టుకున్నారు. విచారణ అనంతరం స్థానిక సీఎస్‌డీటీ హేమలతకు అప్పగించారు. బియ్యాన్ని మంచాడవలస జీసీసీ గోదాంలో భద్రపరిచారు. పట్టుకున్న సరకు విలువ సుమారు రూ.11.53 లక్షలు ఉంటుందని అంచనా. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై రామారావు, హెడ్ కానిస్టేబుల్ కామేశ్వరరావు, కానిస్టేబుల్ తిరుపతిరావు ఉన్నారు.

లారీపై జనసేన గుర్తులు

బియ్యాన్ని తరలిస్తున్న లారీపై పెద్ద అక్షరాలతో జనసేన పేరుతో పాటు, ఆ పార్టీ గుర్తులు ఉన్నాయి. జనసేనకు చెందిన నాయకుడి వాహనంగా తెలుస్తోంది. ఆ బియ్యం తరలింపులో పార్టీ వారి పాత్ర ఉందా? లేకుంటే కేవలం లారీనే ఇచ్చారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

గోదావరిలో వృద్ధురాలి గల్లంతు



వృద్ధురాలు నదిలో దూకిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివకృష్ణ

పి.గన్నవరం: ఆ వృద్ధురాలికి ఏం కష్టం వచ్చిందో తెలియదు గానీ గోదావరిలోకి దూకి తనువు చాలించాలని నిర్ణయించుకుంది. పి.గన్నవరం కొత్త అక్విడెక్టుపై నుంచి వైనతేయ నదిలోకి దూకి గల్లంతైంది. వివరాల్లోకి వెళితే. శనివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఎల్.గన్నవరం వైపున అక్విడెక్టు పార్కులోని గణేశ్ ఆలయం వద్ద ఏర్పాటు వినాయకుని ఉత్సవ విగ్రహాన్ని భక్తులు నదిలో నిమజ్జనం చేశారు. అంతకు ముందు కొద్ది సేపు సుమారు 75 ఏళ్ల వయసున్న ఆ వృద్ధురాలు ఆ ప్రాంతంలో తిరిగింది. వినాయకుని ఉత్సవ విగ్రహాన్ని కూడా దర్శించుకుంది. నిమజ్జనం జరుగుతున్న సమయంలో అక్విడెక్టుపై చెప్పులు విడిచి నదిలోకి దూకి గల్లంతైంది. ఆమె ఎరుపు, నలుపు రంగులతో ఉన్న చీర ధరించిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, వివరాలు సేకరిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రావులపాలెం: స్థానిక అమలాపురం రోడ్డులోని కాలువ గట్టు వద్ద శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక హైస్కూల్ దాటిన తర్వాత రోడ్డు పక్కనే కాలువ చెంత 35 నుంచి 40 ఏళ్ల వయసున్న పురుషుడి మృతదేహం ఉంది. అతడి ఒంటిపై చారల టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కె.గంగవరం: యండగండి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్ (23) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఉదయం గణపతి నిమజ్జనం కోసం కోటిపల్లిలోని గోదావరి వద్దకు స్థానిక యువకులతో కలసి వెళ్లాడు. అనంతరం యండగండికి తిరిగి వచ్చి రాత్రి మళ్లీ పామర్రుకు మోటారు సైకిల్‌పై బయలు దేరాడు. అదే సమయంలో పామర్రు నుంచి అంగర వైపు వెళుతున్న ఊక లోడు లారీ, శ్రీనివాస్ ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కె.గంగవరం ఎస్సై జానీ బాషా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.